www.prajavinikidi.com RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -177 మంగళవారం 13 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

**కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్**

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు**




**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(ప్రజావినికిడి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. మిగతాది 2లో...



## బ్యాట్‌మన్ మాస్కులతో రాహుల్ గాంధీ..

**ఢిల్లీలో కాంగ్రెస్ వినూత్న ప్రచారం**



సాధారణంగా గోతమ్ సిటీని కాపాడే సూపర్‌హీరో బ్యాట్‌మన్ గురించి ఇప్పుడు దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఇండియా కూటమి చేపట్టిన 'ఛలో ఢిల్లీ' మార్చ్‌లో మిగతాది 2లో...

# అప్రూవర్‌గా మారండి

## జ్ఞానేశ్‌కు రాహుల్ గాంధీ సూచన

**200 మంది కేంద్ర ప్రభుత్వ అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు..**

**జ్ఞానేశ్ కుమార్ తనకు సందేశాలు పంపుతున్నారని రాహుల్ వెల్లడి**

**జ్ఞానేశ్ అసలు నేరస్థుడు కాదని.. సూత్రధారులు వేరే ఉన్నారని వ్యాఖ్య**

**సీఈసీని తొలగించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టీకరణ**



**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(ప్రజావినికిడి):** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. మిగతాది 2లో...

# ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..

**వైద్య సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం**

**ఆసుపత్రుల్లో చికిత్స చార్జీలను స్పష్టంగా ప్రదర్శించాలని రాష్ట్రాలకు ఆదేశం**

**రోగులు ముందే ఖర్చుపై అంచనా వేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదం**

**క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయాలి**



**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, మిగతాది 2లో...



## ఆర్థిక శాస్త్రంలో రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు నోబెల్

**స్థూల ఆర్థిక స్థిరీకరణకు అవసరమైన సూక్ష్మ ఆర్థిక పునాదులపై పరిశోధనకు గుర్తింపు**

**స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హాల్**

**కొలంబియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న వుడ్‌ఫోర్డ్**

**ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకుల ఆర్థిక విధాన నిర్ణయాలకు వీరి పరిశోధనలు ప్రయోనకరం**

**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(ప్రజావినికిడి):** ఆర్థిక శాస్త్రంలో 2026 నోబెల్ బహుమతిని అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు ప్రకటించారు. స్థూల ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులను నియంత్రించేందుకు ఉపయోగపడే నమూనాల రూపకల్పనకు అవసరమైనమిగతాది 2లో...

# ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి

**పొన్నం ప్రభాకర్ సవాల్ కు రాంచందర్ రావు స్పందన**

**ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**ఓట్లు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా మీ ముందుకే తెస్తానన్న పొన్నం**



**హైదరాబాద్,అక్టోబర్ 12(ప్రజావినికిడి):** తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితామిగతాది 2లో...

# ఘోర ప్రమాదం

## నలుగురి సజీవదహనం

**విజయవాడ బైపాస్‌లో కాలిబూడిదైన ఈవీ కారు..**

**నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన**

**మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు**



**విజయవాడ అక్టోబర్ 12(ప్రజావినికిడి):** విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. మిగతాది 2లో...

# ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

**ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు**

**ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి**

**తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు**

**మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు**



**అమరావతిఅక్టోబర్ 12(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖమిగతాది 2లో...

# అన్నదాతల సమస్యల పట్ల సర్కారు నిర్లక్ష్యం: హరీశ్



**హైదరాబాద్, అక్టోబర్ 12(ప్రజావినికిడి):** రైతు వేదికల వద్ద రాష్ట్రంలోని అన్నదాతలతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే విషయమై సీఎం రేవంత్ రెడ్డి నాటకాలాడారని బీఆర్‌ఎవీసఎల్పీ ఉప నేత హరీశ్‌రావు ఆరోపించారు. 'రేపు ఉదయం 12 గంటలకు సీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు రావాలని ఆదివారం రాత్రి మెసేజ్‌లు.. ఉదయం 9.52 గంటలకు రద్దయిందని.. 11 గంటలకు ఉంటుందనిమిగతాది 2లో...

# తిరుపతికి మహర్దశ

## రూ.3,222 కోట్ల పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం



**అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన**

**టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం**

**భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి**

**నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం**



**అమరావతిఅక్టోబర్ 12(ప్రజావినికిడి):** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. మిగతాది 2లో...

## ఆర్థిక శాస్త్రంలో రాబర్ట్ హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌కు నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

సూక్ష్మ ఆర్థిక పునాదులపై వారు చేసిన పరిశోధనకు ఈ పురస్కారం దక్కింది. స్టాక్‌హోమ్‌లోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం ఈ విషయాన్ని ప్రకటించింది.

రాబర్ట్ ఈ. హాల్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మైఖేల్ వుడ్‌ఫోర్డ్ కొలంబియా యూనివర్సిటీలో రాజకీయ ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి పరిశోధనలు ఆర్థిక వ్యవస్థలో వృద్ధి, మాంద్యం వంటి పరిస్థితులను ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయి. ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకుని తగిన విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఈ అధ్యయనాలు కీలకంగా నిలుస్తాయి.ఆర్థిక శాస్త్రంలో ఈ పురస్కారాన్ని అధికారికంగా 'ఆల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్ర బహుమతి' అని పిలుస్తారు. స్వీడన్ కేంద్ర బ్యాంకు 1968లో దీన్ని ఏర్పాటు చేసింది. 1969లో తొలిసారిగా ప్రదానం చేశారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ తన వీలునామాలో పేర్కొన్న అసలు ఐదు నోబెల్ బహుమతుల్లో ఆర్థిక శాస్త్ర పురస్కారం లేదు. అయినప్పటికీ మిగతా నోబెల్ పురస్కారాలతో పాటే ఏటా డిసెంబర్ 10న దీన్ని అందజేస్తారు. 1896లో అదే రోజున నోబెల్ మరణించారు.2025లో ఈ బహుమతి జోయెల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు లభించింది. సాంకేతిక పురోగతి, నూతన ఆవిష్కరణలు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి ఎలా దోహదపడతాయో వివరించినందుకు వారిని ఎంపిక చేశారు.

# ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి.కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు.బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి.ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి.

ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది.గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది.

# అప్రూవర్‌గా మారండి

(మొదటి పేజీ తరువాయి)

"మీరు చేసిన తప్పును అంగీకరించి అప్రూవర్‌గా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు" అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్‌కు ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

**సీఈసీ సందేశాలు పంపిస్తున్నారు**

జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా? సందేశాలు పంపారా? అని ఓ విలేకరి అడగ్గా.. రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. అయితే, తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు.

**మోదీ, అమిత్ షా ఒత్తిడి ఉందని ఆరోపణ**

జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు.

**సుప్రీంకోర్టుకు ప్రతిపక్ష కూటమి**

ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

**200 మంది అధికారులు టచ్‌లో**

కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. అయితే, ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు.

**రాజ్యాంగ పరిరక్షణకు అందరూ కలిసి రావాలి**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పాక్షికతపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. పిటిషన్ దాఖలు చేయాలని సీజేఐ సూచించినట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు.జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ, అమిత్ షాపై కూడా తమ పోరాటం కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

# తిరుపతికి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు.

**భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్**

తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో యాత్రికుల కోసం వసతి సముదాయాలు నిర్మించనున్నారు. నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు అందుబాటులోకి రానుండగా, రోజుకు 15 వేల మందికి పైగా భక్తులు బస చేసే వీలుంటుంది.

రూ.160 కోట్లతో నిర్మించే నూతన అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులు భోజనం చేయవచ్చు. వీటితో పాటు రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తారు. వీటిలో ఒకేసారి 16 వేల మంది భక్తులు విశ్రాంతి తీసుకోవచ్చు. రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగంగా ఉండనున్నాయి.

**టీటీడీ ఉద్యోగుల సొంతింటి కల సాకారం**

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో 5,192 మంది టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించే లేఅవుట్ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

**మాస్టర్ ప్లాన్ రహదారులతో మారనున్న రూపురేఖలు**

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా సీఎం ప్రారంభించారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే నగరంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడనుంది. ప్రత్యేకించి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి మూడు కొత్త మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. ఈ సమగ్ర ప్రాజెక్టుల ద్వారా తిరుపతిని ఆధ్యాత్మిక రాజధానిగా మాత్రమే కాకుండా, అత్యుత్తమ మౌలిక వసతులున్న నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది.

ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు. చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్-2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు.

ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

## ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లు.. రాష్ట్రపతి ముర్ము ఉత్తర్వులు

### కేరళ నూతన గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథుర్

### తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్

### కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకూ కొత్త గవర్నర్లు

### బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నియామకాలు అమల్లోకి

**న్యూ ఢిల్లీ అక్టోబర్ 12(ప్రజావినికిడి):**



దేశంలోని ఆరు రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం నూతన గవర్నర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల ప్రకారం కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు బాధ్యతలు చేపట్టనున్నారు. కొందరిని బదిలీ చేయగా, మరికొందరిని కొత్తగా నియమించారు.వివరాల్లోకి వెళితే, ప్రస్తుతం సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళ నూతన గవర్నర్‌గా నియమించారు. ఇప్పటివరకు కేరళ గవర్నర్‌గా పనిచేసిన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా బదిలీ చేశారు. ఇక, కర్ణాటక కొత్త గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్రపతి భవన్ నిర్ణయం తీసుకుంది.ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే, ఒడిశా గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధల్ సింగ్ బిసెన్‌ను నియమించారు. ఓం ప్రకాశ్ మాథుర్ కేరళకు బదిలీ కావడంతో, ఖాళీ అయిన సిక్కిం గవర్నర్ పదవిలో దుష్యంత్ గౌతమ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ తన ప్రకటనలో పేర్కొంది.ఈ నియామకాలన్నీ సంబంధిత వ్యక్తులు తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది.

# ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)



పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సవరణలో పేర్ల తొలగింపు అంశంపై ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ సవాల్ విసిరారు.ఓటర్ల జాబితాల సవరణపై బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఓట్ల తొలగింపుపై రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "రాంచందర్ రావు తేదీ, సమయం ప్రకటిస్తే.. ఓటు హక్కు కోల్పోయిన వారిని ఆధారాలతో సహా ఆయన ముందుకే తీసుకొస్తాను" అని పొన్నం స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ (ా×=) ప్రక్రియలో పొరపాట్లు జరిగితే సరిదిద్దాల్సింది పోయి, బీజేపీ నేతలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.

మంత్రి పొన్నం సవాల్‌పై స్పందించిన రాంచందర్ రావు... ఓట్లు తొలగించబడినట్టు చెబుతున్న ఒక 10 మందిని ఎన్నికల సంఘం కార్యాలయానికి తీసుకురావాలని ప్రతి సవాల్ విసిరారు. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (ాఫీఖీడ్) పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం నుంచి వైదొలగగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి ఫసల్ బీమా యోజనలో చేరాలని ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మొత్తంమీద, ఈ సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

## అన్నదాతల సమస్యల పట్ల సర్కారు నిర్లక్ష్యం: హరీశ్

(మొదటి పేజీ తరువాయి)

మరో మెసేజ్.. మధ్యాహ్నం ఒంటిగంటకు సీఎంకు బదులు డిప్యూటీ సీఎం పాల్గొంటారని రైతులతో నాటకాలాడారు' అని చెప్పారు. రైతు సమస్యలపై సీఎం అధ్యక్షతన సమావేశం ఉంటుందని మొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించిన రోజే గోవా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. మరునాడు ఢిల్లీకెళ్లారని, ఆయన బాటలోనే మంత్రులు కూడా హస్తిన బాట పట్టారన్నారు.రైతులు పంటలు సాగు చేయకుంటే ఏం చేయాలని నిలదీశారు. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో కరంటు కోత ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, 'రెండు చేతులా సంపాదన.. కేంద్రీకృత టెండర్లలో కమీషన్ల దందా.. సంక్షేమ హాస్టళ్లకు సరుకుల సరఫరాలో అవినీతి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనం క్లిప్పింగ్‌ను హరీశ్‌రావు తన ఎక్స్ ఖాతాలో పోస్టుచేశారు. గురుకుల సంస్థల కాంట్రాక్టుల్లో జరుగుతున్న 20 శాతం కమీషన్లపై ఎందుకు విజిలెన్స్, సిట్ విచారణ చేపట్టడం లేదని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ ఖాతాకు తన పోస్టును ట్యాగ్ చేశారు.

హరీశ్‌రావు మామ మాధవరపు హన్మంతరావుకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు చెందినదిగా పేర్కొంటున్న 3.22 ఎకరాల భూమి విషయంలో తుది తీర్పు ఇచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని రెవెన్యూశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. సిద్ధిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట గ్రామంలోని సర్వే నెంబర్ 271/18 ఈఈ, 271/18ఈ, 271/98లోని 3.22 ఎకరాలు అసైన్డ్ భూమి అని, దానిని హన్మంతరావు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేశారని రెవెన్యూ అధికారులు తెలిపారు.ఆ కొనుగోలు చెల్లదని, అందువల్ల దానిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని పేర్కొంటూ షోకాజ్ నోటీసులు పంపారు. వాటిని అడ్డుకోవాలని కోరుతూ మాధవరపు హన్మంతరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. షోకాజ్ నోటీసుకు రెండువారాల్లో వివరణ ఇవ్వాలని హన్మంతరావుకు ఆదేశాలు జారీచేసింది. తది తీర్పు ఇచ్చే వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోరాదని రెవెన్యూ అధికారులకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

## ఈడీ, సీబీఐ సరిపోక ఈసీని వాడుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ా×=) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు.

ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.ం

బ్యాట్‌మన్ మాస్కులు ప్రత్యేకాకర్షణగా నిలవడమే ఇందుకు కారణం. ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ నేతలు పంపిణీ చేసిన ఈ మాస్కులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పట్టుకుని ఫొటోలకు పోజులిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాహుల్ మాస్క్ ధరింపజేయడం మరింత ఆసక్తికరంగా మారింది. ఈ పోస్టులను ఎన్ఎస్‌యూఐ ఎక్స్‌లో షేర్ చేసింది.

రాహుల్‌ను అన్యాయంపై పోరాడే వ్యక్తిగా చూపే ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్ సోషల్ మీడియాలో బ్యాట్‌మన్ వేషాలను విస్తృతంగా వినియోగిస్తోంది. గతంలో రాహుల్‌ను బ్యాట్‌మన్‌తో పోలుస్తూ కాంగ్రెస్ 13 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు జరిగిన ప్రతిపక్షాల మార్చ్‌లో రాహుల్ బారికేడ్లపై నిల్చున్న దృశ్యాలను.. గోతమ్ నగరంలోని ఓ భవనంపై నిలబడిన బ్యాట్‌మన్‌తో జోడించి పోస్ట్ చేసింది. ఇన్‌స్టాలో 'మీరు బ్యాట్‌మనా?' అని కాంగ్రెసన్ అగ్రనేతను అడగ్గా.. 'నేనూ, బ్యాట్‌మన్ ఒకే గదిలో ఉన్నట్లు ఎవరూ ఎప్పుడూ చూడలేదు' అని ఛలోక్తులు విసిరారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

మంగళవారం 13 అక్టోబర్ 2026

# ఎన్టీఆర్ భవన్ లో తెలుగుదేశం పార్టీ అనుబంధ విభాగం ఎస్సీ సెల్ సమావేశం

**ఎస్సి సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పాలంపల్లి అశోక్ అధ్యక్షతన కార్యక్రమం**

**రాష్ట్రంలో 22ఎ భూ సమస్యలు పరిష్కరించాలి**

**ప్రభుత్వ భూములను దళితులకు,పేదలకు,పంచాలి**

**ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్యే,పోలిట్ బ్యురో సభ్యులు బక్కని నర్సింహులు సూచన**



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
అక్టోబర్12, హైదరాబాదులోని ఎన్టీఆర్ భవన్లో టీ టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్సీ సెల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే,టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు,
ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ,
ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలోనే పటేల్ పట్వారి వ్యవస్థను ఒక్క కలం పోటుతో రద్దు చేశారన్నారు.
తద్వారా వెట్టి చాకిరి ద్వారా జరుగుతున్న దోపిడీ నిలువరించడం జరిగింది.ఎన్టీఆర్ మాల మాదిగల కొరకు 46 ఆశ్రమ పాఠశాలలను మొదటిసారిగా ఏర్పాటు చేశారు.భారత దేశంలో ఏ ముఖ్యమంత్రి దళితుల కొరకు అప్పటివరకు ఏర్పాటు చేయలేదు.వీటిని నారా చంద్రబాబు నాయుడు 294 నియెజకవర్గాలకు విస్తరింపచేశారు.విజన్ 2020 కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడు మెదక్ జిల్లా పెద్దిరెడ్డిపేట లో తుల్జాభవాని దేవాలయంలో దళితులను అలయప్రవేశం చేయించారు.చంద్రబాబు నాయుడు ఎస్సీ కార్పోరేషన్ నుంచి భూముల కొనుగోలు చేసి దళితులకు ఇవ్వడం జరిగింది.చంద్రబాబు నాయుడు అమలు చేసిన మళ్లీ బడికి పథకం ద్వారా బిసిలు,ఎస్సీలకు లాభం జరిగింది.సచివాలయాన్ని చంద్రబాబు నాయుడు గ్రామాల వద్దకు తీసుకెళ్లారు.టిడిపి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో తొలి దళిత మహిళ స్పీకర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తొలి దళిత మహిళ స్పీకర్ ప్రతిభా భారతిని దేశంలో అత్యున్నత చట్ట సభ అయిన లోక సభ స్పీకర్ గా బాలయోగిని చంద్రబాబు నాయుడు నియమించడం జరిగిందన్నారు.
గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధినేత దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చేయలేదు.అలాగే మూడు ఎకరాల భూమిని ధళితులకు ఇస్తామని హామీని ప్రక్కన పెట్టేశారు.ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దళితులకు ఏమీ చేయడం లేదు.రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ భూములు,సర్కారు భూములు,సీలింగ్ భూములు ఎన్ని ఉన్నాయి.? ఈ భూముల లెక్కలను, గ్రామ,మండల,స్థాయిలలో ప్రజలకు అందుబాటులో ఉంచాలి.హైదరాబాద్ చుట్టుప్రక్కల అక్రమణలకు గురైన భూములను బయటకు తీయాలి.ప్రభుత్వం ఈ అక్రమణల లెక్కలను బయటకు తీయకపోతే తెలుగుదేశం పార్టీ ఉద్యమం చేపడుతుంది. గత ప్రభుత్వం ప్రభుత్వ భూములను పెదలకు పంచలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన పంచాలి.

**వస్తున్న మీకోసం పాదయాత్ర**

తెలుగుదేశం పార్టీ తెలంగాణ ప్రాంతంలో వస్తే ఎస్సీ,ఎస్టీ,బిసి వర్గాల ప్రజలు వీరులవుతారని అందరికీ భయం.వస్తున్నా మీకోసం పాదయాత్రలో చంద్రబాబు నాయుడు గద్వాల వద్ద నేను పెద్ద మాదిగను అని తెలిపారు.ఇటువంటి వాఖ్యలు ఇప్పటివరకు ఏ నాయకుడు కూడా ఇంతవరకు చేయలేదు.తెలుగుదేశం పార్టీ నిలబడాలంటే మనం అందరం నడుం బిగించాలి. పోలిట్ బ్యురో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ,ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు తప్పకుండా చేస్తామని చేప్పే వాగ్దానాలను నమ్మి బడుగు బలహీన వర్గాలు ఓట్లు వేసి గెలిపిస్తారు.తెలంగాణ ఉద్యమ సమయంలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రజలను నమ్మించి అదికారంలోకి వచ్చాక ఆ హామీని పక్కన పెట్టేశారు. దళితులకు మూడు ఎకరాలు భూమిని ఇస్తామని ఆశ చూపించారు.ఈ హామీని నేరవేర్చలేదు. బడుగు బలహీన వర్గాలకు ధైర్యం ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ,తెలుగుదేశం పార్టీ రాకముందు ఓట్లు బడుగు బలహీన వర్గాలవి అధికారం మాత్రం పెత్తాందారుల వద్దే ఉండేది. తెలుగుదేశం పార్టీ తీసుకువచ్చిన సామాజిక న్యాయం వల్ల బడుగు బలహీన వర్గాలకు గౌరవం పెరిగింది. బాలయోగిని దేశంలోనే అత్యున్నత స్పీకర్ గా అందరూ చేతులెత్తి నమస్కరించే స్థానంలో చంద్రబాబు నాయుడు కూర్చోబెట్టారుఅని అన్నారు.ఎస్సీవర్గీకరణ చేసింది తెలుగుదేశం పార్టీయే.. బడుగు బలహీన వర్గాలను పేదలను అభివృద్ధి చేయడంలో తెలుగుదేశం పార్టీ ముందు ఉంటుంది.టిఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో గాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో గాని భూములు అక్రమణలకు గురైనాయి.
ఇప్పుడూ కూడ గురవుతన్నాయి.దళితులకు ప్రభుత్వ



భూములను పంచాలి. తెలుగుదేశం పార్టీ అదికారంలో కీలక పాత్ర పోషించే విదంగా మనమందరం కృషి చేద్దాం అని అన్నారు.ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు పొలంపల్లి అశోక్ మాట్లాడుతూ,
గత బిఆర్ స్ ప్రభుత్వం మూడు ఎకరాల భూమి,డబుల్ బెడ్ రూం ఇస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు.
ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం దళితుల వద్ద ఉన్న భూమి గుంజూ కుంటూ.. పరిశ్రమలకు ఇస్తున్నారు.22ఎ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. దళితుల గుండెల్లో తెలుగుదేశం పార్టీ ఉంది.అందరం కలిసి కట్టుగా ఉండీ కష్టపడి పార్టీని ముందుకు తీసుకెళదాం.
ఈ సమావేశంలో ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో 108 అడుగుల జాంబవంతుని విగ్రహం ఏర్పాటు చేయాలని ఏపిలో కూటమి ప్రభుత్వం నిర్ణయించినది.
జాంబవంతుని 108 అడుగుల విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం 20 కొట్ల 17 లక్షల మంజూరు.
ఒంటిమిట్ట కోదండ రామస్వామి దేవాలయంలో జాంబవంతుడి విగ్రహ ప్రతిష్టాపనకు నిధులు విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి,హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతూ తీర్మానం చేశారు.ఈ కార్యాక్రమంలో మెదక్,పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్లు ఇల్లందుల రమేష్,సంజయ్,మాజీ రాష్ట్ర కార్యదర్శి జనగాం నర్సింగ్ రావు ఎస్సీ సెల్ నాయకులు గూడేపు రాఘవులు,గద్దపాటి వెంకటేశ్వర్లు, దామోదన్ రావు, జీ.వెంకటేష్,జోగెందర్ సింగ్,టి అనిల్,సత్యనారాయణ, శ్రీరాములు,ఎన్.కాశయ్య,మోరె ప్రభాకర్ తదితరులు పాల్గోన్నారు

# కిషన్‌గూడ ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి



**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 12:** శంషాబాద్ పరిధిలోని కిషన్‌గూడ ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.ఈ ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అక్టోబర్ 11న ఉదయం 7.55 గంటల సమయంలో కిషన్‌గూడ ఫ్లైఓవర్‌పై సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, ప్రాథమిక విచారణ చేపట్టారు. విచారణలో మృతుడు గత కొన్ని నెలలుగా శంషాబాద్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అయితే,అతడి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మృతుడి ఆచూకీ, కుటుంబ సభ్యుల వివరాలను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 198 మంది పారిశుద్ధ్య కార్మికులకు పండుగ కానుకలు

**శంషాబాద్‌లో శ్రీ యోగ వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**





**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 12:** దసరా,దీపావళి పండుగలను పురస్కరించుకుని సంత్ శ్రీ ఆశారామ్ జీ బాపూ ప్రేరణతో శ్రీ యోగ వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పండుగ కానుకలు అందజేశారు. శంషాబాద్ జోన్ పరిధిలోని 198 మంది కార్మికులకు నూతన వస్త్రాలు, చీరలు,స్వెటర్లు, స్టీల్ పాత్రలు, నిత్యావసర వస్తువులు,సత్ సాహిత్య గ్రంథాలు, లాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం సామూహిక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్ రెడ్డి, నార్సింగి మార్కెట్ మాజీ చైర్మన్ డి. వెంకటేష్,మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులకు కానుకలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించి,వారికి అండగా నిలుస్తూ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమితి అధ్యక్షుడు ముక్తియార్ సింగ్, ఉపాధ్యక్షుడు జేశురాజ్ బాలాపూర్, అశ్విని, విజయపురి, నవీన్,మనోజ్, ఉమేష్,శరత్ చంద్ర తదితర సేవాదారులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**ఇంద్రపార్క్ ధర్నాకు బీజేపీ మద్దతు:తోకల శ్రీనివాస్‌రెడ్డి**





**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 12,**
వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో 20 ఏళ్లకు పైగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు వైద్య సేవలందించడంతో పాటు కోవిడ్ సమయంలోనూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు విశేష సేవలు అందించారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ,వారికి ఉద్యోగ భద్రత,వేతనాల పెంపు, క్రమబద్ధీకరణ విషయంలో న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఏళ్ల తరబడి ఒకే వేతనంతో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని గతంలో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని, వారు చేపట్టనున్న ఇంద్రపార్క్ ధర్నాకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా వైద్య అధికారులు డాక్టర్ దినేష్, ఆదిత్య,చేతన్, నేతర్, సాయిబాబా, బాలకృష్ణ, సంగీత,అనూప్ తదితరులు పాల్గొన్నారు.

# పతాంజలి యోగ సెంటర్ లో భవాని మాత పూజా అన్న వితరణరణ కార్యక్రమం లో పాల్గొన్నఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని షాద్ నగర్ పట్టణంలోని పతంజలి యోగ సెంటర్‌లో కొలువుదీరిన భవానీ మాతను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దర్శించుకున్నారుదేవీ నవరాత్రులలో భాగంగా కాకునూరు మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి ఏర్పాటుచేసిన పూజ అలాగే అన్న వితరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,భవానీ మాత అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని,ప్రతి ఒక్కరి జీవితాల్లో ఈ నవరాత్రులు కొత్త వెలుగులు నింపాలని ఆయన కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్ మాజీ కౌన్సిలర్లు రేటికల్ నందీశ్వర్, యుగంధర్,చెట్ల నర్సింహులు,పాలమాకుల చెన్నయ్య, కంటెస్టెంట్ కౌన్సిలర్లు నక్కల వెంకటేష్,రాజేందర్ సింగ్, లింగం దాన సర్పంచ్ నాగిల వెంకటేష్,మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,శ్రీనివాస్ రెడ్డి,ఉపసర్పంచ్ యారం రాంరెడ్డి,నాయకులు శ్రీకాంత్ గౌడ్,దినేష్ సాగర్, భక్తులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్పి అధినేత మల్లన్న సమక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో డా.రవి కుమార్ చేరిక

**పాలమూరు యూనివర్సిటీ వేదికగా తీన్మార్ మల్లన్న సమక్షంలో వివిధ పార్టీల నాయకులు టీఆర్పీలో చేరిక**



**షాద్ నగర్,(ప్రజావినికిడి): అక్టోబర్ 12:**పాలమూరు యూనివర్సిటీ లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు ఎమ్మె సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.ఈ సందర్భంగా డా.రవి కుమార్ మరియు తదితరులకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన నాయకులు,బీసీ సంఘాల ప్రతినిధులు తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికారఉద్యమానికి,మల్లన్న చేస్తున్న బీసీ రాజ్యాధికార యాత్రకు సంఘీభావం ప్రకటించారు.బీసీల రాజకీయ హక్కులు,రాజ్యాధికార సాధనే లక్ష్యంగా కొనసాగుతున్న బీసీ రాజ్యాధికార పాదయాత్రకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.అనంతరం తమ ప్రాంతంలోని పలు స్థానిక సమస్యలను తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో టీఆర్పీ రంగారెడ్డి ఇంచార్జి బి నరసయ్య గౌడ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ షాద్‌నగర్ ఉపాధ్యక్షులు మీదికేరి రాధాకృష్ణ,ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షులు జగన్,గుల్ల శ్రీనివాసులు,గుల్ల హరిప్రసాద్, శంకర్ తో పాటు పలువురు తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# లక్ష్మీనగర్ పార్కుకు కొత్త కళ.. ప్రజారోగ్యానికి పెద్దపీట.!

**ఓపెన్ జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు, చిన్నారుల ఆట స్థలం ప్రారంభించిన: ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్..**





**రాజేంద్రనగర్ (ప్రజావినికిడి): అక్టోబర్12,**
కాలనీవాసుల ఆరోగ్యానికి భరోసా.. చిన్నారుల ఆటపాటలకు ఆహ్వానం.. ఆహ్లాదకరమైన వాతావరణానికి వేదికగా లక్ష్మీనగర్ పార్కు రూపుదిద్దుకుంది. అత్తాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ పార్కులో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు,చిన్నారుల ఆట వస్తువులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఏర్పాట్లు చేపట్టారు.ఓపెన్ జిమ్ అందుబాటులోకి రావడంతో యువత,పెద్దలు పార్కులోనే వ్యాయామం చేసుకునే అవకాశం కలిగింది. బ్యాడ్మింటన్ కోర్టుతో క్రీడాకారులకు ప్రోత్సాహం లభించనుండగా, చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు పిల్లలకు ఆహ్లాదకరమైన ఆటవిడుపును అందించనున్నాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. పార్కులు కేవలం వినోద ప్రదేశాలుగానే కాకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, కుటుంబ సభ్యులు ఆహ్లాదంగా గడిపేందుకు ఉపయోగపడాలని పేర్కొన్నారు. ప్రజలు నూతన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు పార్కు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్థానికంగా పార్కులో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రావడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సరూర్‌నగర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలకు హద్దేది..

**సెక్షన్ ఆఫీసర్, ఏసీపీ కనుసైగల్లోనే దందా సాగుతోందా.?**

**ఎన్ని ఫిర్యాదులు చేసినా డోంట్ కేర్ అంటున్న అధికారుల తీరు..**

**నోటీసులు లేవు.. కూల్చివేతలు లేవు..**

**అంతా సెటిల్మెంట్లేనని ఆరోపణలు..**

**కూల్చివేసిన భవనంలో మళ్లీ నిర్మాణ పనులు.. అండగా నిలుస్తున్నదెవరు.?**








**ఎల్బీనగర్, (ప్రజావినికిడి):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారా.? సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు పెరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందుతున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) బాధ్యతలు ఏమయ్యాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.అక్రమ నిర్మాణాల గురించి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడం వెనుక ఆంతర్యమేమిటని స్థానిక ప్రజలు నిలదీస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందినప్పుడు నోటీసులు జారీ చేయడం, పనులను నిలిపివేయించడం,అవసరమైన సందర్భాల్లో చట్టప్రకారం కూల్చివేతలు చేపట్టడం అధికారుల విధి. కానీ సరూర్‌నగర్ సర్కిల్‌లో ఈ ప్రక్రియ ఎంతవరకు అమలవుతోందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరూర్నగర్ సర్కిల్ పరిధిలో కమల నగర్,రోడ్ నెం3,పక్కన ఇంటి నెం 3-17-11, సంస్కృతి స్కూల్ పక్కన 11-6-376, కమలానగర్ 17138/3, నేతాజీ పక్కింటి నెంబర్,నగర్ 2370/6 అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేసిన అధికారుల స్పందన శూన్యం అంటూ మండిపడుతున్నారు.

### నోటీసులు ఇవ్వరు.. కూల్చివేతలు చేయరు..

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోతే అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోతుంది. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం దెబ్బతినడంతో పాటు పట్టణ ప్రణాళిక వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సైతం సన్నగిల్లే ప్రమాదం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాల విషయంలో నోటీసులు, కూల్చివేతల కంటే సెటిల్మెంట్లకే ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు విజిలెన్స్ అధికారులచే సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు.



### కూల్చివేసిన భవనంలో మళ్లీ పనులా.?

ఇక కూల్చివేతలు చేపట్టిన భవనంలోనే తిరిగి నిర్మాణ పనులు జరుగుతున్నాయనే అంశం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఒకసారి కూల్చివేత చర్యలు చేపట్టిన భవనంలో మళ్లీ పనులు ప్రారంభమైతే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నట్లు.? పనులు జరుగుతున్న విషయం వారి దృష్టికి రాలేదా.? తెలిసినా పట్టించుకోవడం లేదా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.కూల్చివేతల అనంతరం పర్యవేక్షణ బాధ్యత ఎవరిది.? నిబంధనలను ఉల్లంఘించి మళ్లీ నిర్మాణాలు చేపడితే వాటిని అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఎందుకు స్పందించడం లేదన్నది తేలాల్సి ఉంది.

### ఉన్నతాధికారులు స్పందించాలి..

సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అందిన ఫిర్యాదులు,జారీ చేసిన నోటీసులు, చేపట్టిన కూల్చివేతలు, తిరిగి నిర్మాణాలు జరుగుతున్న భవనాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.సెక్షన్ ఆఫీసర్ నుంచి ఏసీపీ స్థాయి వరకు అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించి, ఆరోపణల్లో వాస్తవాలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ నిబంధనలకు విలువ ఎక్కడుంటుంది.? బాధ్యులపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారు.? సరూర్‌నగర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న అసలు వ్యవహారం ఏమిటో ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

# షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో దుర్గామాత ఉత్సవాలపై శాంతి కమిటీ భేటీ

**అనుమతులు తప్పనిసరి..శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు**

**షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ**





**షాద్ నగర్,(ప్రజావినికిడి): అక్టోబర్12,** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో,భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ సూచించారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టే ఉత్సవ కమిటీ నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సుమారు 40 మంది ఉత్సవ కమిటీ నిర్వాహకులు,సభ్యులు పాల్గొన్నారు. ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ,దుర్గామాత విగ్రహాల ప్రతిష్ఠాపన, మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని,సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు.విగ్రహాల ప్రతిష్ఠాపన,విద్యుత్ సదుపాయాలు,ఊరేగింపులు,ఇతర ఉత్సవ కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు,పోలీస్ శాఖ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.అన్ని మతాల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ మత సామరస్యం, పరస్పర సోదరభావాన్ని కాపాడాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వకూడదని పేర్కొన్నారు.అదేవిధంగా ఉత్సవాల సమయంలో ప్రజలకు,వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.ఉత్సవాల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసుల సూచనల మేరకు వ్యవహరించాలని తెలిపారు. దుర్గామాత ఉత్సవాలను క్రమశిక్షణతో, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించి షాద్‌నగర్ పరిధిలో శాంతిభద్రతలు,మత సామరస్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ఏసీపీ లక్ష్మీనారాయణ సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సీతారాం,దుర్గామాత మంటప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సుల్తాన్‌పల్లిలో అనాథ చిన్నారులకు అండగా ఆశ్రమం

**ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**






**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 12:** అనాథ చిన్నారులకు ఆశ్రయం కల్పించి,వారి భవిష్యత్తుకు భరోసా అందించే లక్ష్యంతో సేవా భారతి ఫౌండేషన్ ముందడుగు వేసింది. శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లిలోని వృద్ధాశ్రమ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అనాథాశ్రమాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. సుమారు 20 మంది అనాథ చిన్నారులకు ఆశ్రయం,వసతి కల్పించే ఉద్దేశంతో ఈ ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. చిన్నారులకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు వారి సంరక్షణకు అవసరమైన సదుపాయాలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం తెలపారు.
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి.. బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** 132-జీడిమెట్ల డివిజన్ వెస్ట్ ఎం.ఎన్.రెడ్డి నగర్ లో బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అసంపూర్ణంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ విషయంపై కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టి పనులను త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, చీఫ్ అడ్వైసర్ రాముడు యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి క్రిష్ణ పటేల్, కోశాధికారి రాజు, కాలనీ యూత్ అధ్యక్షులు రాజు యాదవ్,కాలనీ వాసులు మురళి, బస్వరాజు,శేఖర్ గౌడ్,నర్సింహ, క్రిష్ణ,స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బుద్వేల్‌లో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**



**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబరు12,** అత్తాపూర్ సర్కిల్ పరిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి.బుద్వేల్ రైల్వే స్టేషన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రీ దేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా ఉదయం వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది.భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండటంతో భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది. ఉత్సవాల సందర్భంగా కమ్యూనిటీ హాల్ పరిసరాలు సందడిగా మారగా, అమ్మవారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ఈ ఉత్సవాలతో బుద్వేల్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో కమిటీ యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## దుండిగల్ డివిజన్ కెవిఆర్ వ్యాలీ మెయిన్ రోడ్డులో రూ.46 లక్షల సిఎంసి నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన





**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ డివిజన్,కెవిఆర్ వ్యాలీ మెయిన్ రోడ్డులో నెలకొన్న రహదారి సమస్యలను స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో,ఆయన ప్రత్యేక చొరవతో సిఎంసి నిధుల నుంచి రూ.46 లక్షలు మంజూరయ్యాయి.ఈ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు సంగొల్ల మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజలకు కావలసిన మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడంతో పాటు,దుండిగల్ డివిజన్‌లో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, ప్రాంత సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి,డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్,కొలన్ జీవన్ రెడ్డి,మాజీ సర్పంచ్ కావలి గణేష్, నిజాంపేట్ సర్కిల్ డివిజన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బోట్ల విజయ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పిసరి మహేందర్ రెడ్డి,మనోజ్, సురేష్,లక్ష్మారెడ్డి, గురువారెడ్డి, మనోహర్, గోపాల్ పద్మారావు, ఆకుల ప్రేమ్ కుమార్, మల్లంపేట్ ప్రకాష్,రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా 6.70 లక్షల వ్యయంతో శాంక్షన్ అయిన మంజీరా లైన్ పనులకు శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధి ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేస్ -1లో రూ.6.70 లక్షల వ్యయంతో నూతనంగా హెచ్ఎం డబ్ల్యుఎస్ వాటర్ వర్క్స్(కుత్బుల్లాపూర్ వార్డ్)ద్వారా శాంక్షన్ అయిన మంజీరా లైన్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం లో కాలనీ వాసులతో కలిసి పాల్గొని మంజీరా లైన్ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించి కాలనీలోని ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు,తాగునీటి సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి,ప్రజలకు సౌకర్యవంతమైన నీటి సరఫరా అందించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాలనీల అభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం అవసరమని పేర్కొన్న బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి.ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు సంపత్ గౌడ్,ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,కోశాధికారి కరుణాకర్ రెడ్డి, సహా కోశాధికారి బాపిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిక్షపతి గౌడ్, విజయ్,నార్లకంటి దుర్గయ్య,పెద్దింటి సాయిలు,నర్సింహ రెడ్డి,కర్నె శ్యామ్,సతీష్ చక్రవర్తి,విట్టల్,శంకర్,శ్రావణ్ బోస్,శివ కృష్ణ నాగేశ్వరరావు వెంకటేష్, శ్రీనివాస్,చిదంబర శాస్త్రి,రాజేష్,ఎల్లా గౌడ్,ప్రసాద్, వినోద్ రెడ్డి,సత్య రామ్,కాశీనాథ్,శివ,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఎజిఎచ్ఎస్, పెద్దగొల్లగూడెం విద్యార్థినుల ప్రతిభ

## త్రయాథ్లాన్. ఎ,లో స్వర్ణం, లాంగ్ జంప్‌లో రజతం, త్రయాథ్లాన్, బి,లో కాంస్యం

**వాజేడు,అక్టోబర్ 13,(ప్రజావినికిడి):**
ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ సబ్‌జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-అక్టోబర్ 11న, జరిగిన క్రీడలలో ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్ పెద్దగొల్లగూడెం పాఠశాల విద్యార్థినులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు మూడు పతకాలు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు.




**పతక విజేతల వివరాలు:**
అక్షర-స్వర్ణ పతకం: ట్రయాథ్లాన్-ఎ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. హర్షిణి-రజత పతకం:లాంగ్ జంప్ పోటీలో ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని కైవసం చేసుకుంది. హర్షిత-కాంస్య పతకం: ట్రయాథ్లాన్-బి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించింది. విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం పట్ల ఎజిఎచ్ఎస్ పెద్దగొల్లగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇరుప కేశవరావు, ఉపాధ్యాయులు పూనెం రోజారాణి, శ్రీమతి పాయం తిరుపతమ్మ, పెండ కట్ల బుచ్చిబాబు, తోలేం కృష్ణయ్య, శ్రీమతి కోడే భారతి,శ్రీమతి యాలం ఉమాదేవి, శ్రీమతి మిశ్రం సృజన,శ్రీమతి అరేం సౌజన్య, అట్టం రామారావు, శ్రీమతి ఇర్ప గౌతమి,శ్రీమతి యాలం ధనలక్ష్మి, కుమారి గొంది కవిత,ఫిజికల్ డైరెక్టర్ శ్రీ గుండ్ల రాజు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినులను అభినందించారు విద్యార్థినుల విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఈ సందర్భంగా వారు అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థినులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్ పెద్దగొల్లగూడెం పాఠశాల కుటుంబం తరఫున పతక విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు

# ప్రజావాణిలో ప్రజా సమస్యల పరిష్కారానికి వినతి పత్రం

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ.వివేకానంద్ సూచనల మేరకు,125-డివిజన్ గాజులరామారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ సాయి మరియు కస్తూరి బాలరాజు ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ని కలిసి, డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన,డ్రైనేజీ సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి, పార్కుల పరిరక్షణ తదితర అంశాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి, క్రింది పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు.



**ప్రతిపాదించిన అభివృద్ధి పనులు:**
మహదేవపురం:ఎస్ బ్లాక్, ఎక్స్ బ్లాక్,జె బ్లాక్‌లలో డ్రైనేజీ లైన్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ నీటి సరఫరా పైప్‌లైన్లు మరియు సీసీ రోడ్ల నిర్మాణం.
మల్లారెడ్డి నగర్ ఫేజ్-1:డ్రైనేజీ లైన్ల ఏర్పాటు మరియు సీసీ రోడ్ల నిర్మాణ పనులు.
మహదేవపురం: మాంట్రిడ్జ్ స్కూల్ సమీపంలోని పార్కు వెనుక భాగంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం.
మల్లారెడ్డి నగర్ 60 అడుగుల రోడ్డు తదితర అభివృద్ధి పనులకు శాశ్వత పరిష్కారం చూపాలని వినతిపత్రం అందజేశారు.

# ఎల్ టి ఆర్, కేసుల విషయంలో కోర్టు తీర్పుని గౌరవించండి

## ఆదివాసి నవనిర్మాణ సేనా ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్..




**వాజేడు,అక్టోబర్ 13,(ప్రజావినికిడి):**వాజేడు గ్రీవెన్స్ డే లో ఎఎన్ఎస్, ఆధ్వర్యంలో ఏజెన్సీ ఎస్ డి సి,కోర్టు నుండి వచ్చిన ఎల్ టి ఆర్,కేసులు ఎన్ని ఉన్నవో ఏజెన్సీ కోర్టును గౌరవించి వాటిని వెంటనే పరిష్కరించి ఆదివాసీలకు న్యాయం చేయాలని అలాగే 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలుపరచాలని పీసా గ్రామసభ తీర్మానం లేకుండా ఎటువంటి కాంట్రాక్టు పనులు ప్రారంభించకూడదని గ్రీవెన్స్ డే లో వినతి పత్రం అంద చేయడం జరిగినది ఎఎన్ఎస్,ఆదివాసి నవనిర్మాణ నాయకులు సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ కుమార్, తల్లాడి ప్రసాద్,మహేష్, తల్లండి, సంతోష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాద్‌కు చేరిన భారత్, వెస్టిండీస్ జట్లు..

## సిరీస్‌పై టీమిండియా గురి..సమం చేయాలని కరీబియన్ల పట్టుదల




**శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్12,** భారత్, వెస్టిండీస్ క్రికెట్ జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. అక్టోబర్ 14న ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న నాలుగో టీ20 మ్యాచ్ కోసం ఇరు జట్ల ఆటగాళ్లు ఇండోర్ నుంచి ప్రత్యేక చార్టర్డ్ విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. భారత క్రికెటర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్, సంజూ శాంసన్ తదితరులు విమానాశ్రయంలో కనిపించడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. తమ అభిమాన ఆటగాళ్లను చూసేందుకు క్రికెట్ ప్రేమికులు ఆసక్తి చూపించారు. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో ఉన్న నేపథ్యంలో నాలుగో మ్యాచ్ కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా భావిస్తుండగా, గెలుపుతో సిరీస్‌ను 2-2తో సమం చేయాలని వెస్టిండీస్ పట్టుదలతో ఉంది. దీంతో ఉప్పల్ స్టేడియంలో జరగనున్న పోరుపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కు అండగా కనకాల శివాజీ

**అంబర్ పేట్, (ప్రజావినికుడి):**
ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌పై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ఆరోపణలను మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనకాల శివాజీ తీవ్రంగా ఖండించారు. బల్మూరి వెంకట్‌కు పూర్తి మద్దతుగా నిలిచారు. విద్యార్థి దశ నుంచే ఎంతో కష్టపడి విద్యార్థులకు అండగా నిలిచిన నాయకుడు బల్మూరి వెంకట్ అని కొనియాడారు. 2015లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. సొంత కుటుంబాన్ని సైతం పక్కనబెట్టి ప్రజల కోసం, విద్యార్థుల కోసం పని చేసిన నాయకుడిపై బీఆర్ఎస్ నేతలు నోరు పారేసుకోవడం సరికాదని హెచ్చరించారు. వ్యక్తిగతంగా విమర్శలు చేయడం బీఆర్ఎస్ నేతల



దిగజారుడుతనానికి నిదర్శనమని, ఇలాంటి తప్పుడు ఆరోపణలను కాంగ్రెస్ శ్రేణులు ఏమాత్రం సహించబోరని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ నాయకులు తలచుకుంటే అవినీతి, అక్రమాలతో జైలుకు వెళ్లాల్సింది బీఆర్ఎస్ నేతలేనని, బల్మూరి వెంకట్‌పై చేస్తున్న కుట్రపూరిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# వృక్షజీవి డాక్టర్ మార్కండేయులుకు,ఆయన బృందం పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థకు 'అడవుల మిత్రుడు' పురస్కారం

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
విశ్వగురు ప్రపంచ రికార్డుల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గేమ్ ఛేంజర్స్ పురస్కారాలు 2026' కార్యక్రమంలో, బంజారాహిల్స్‌లోని ప్రసాద్ చలనచిత్ర ప్రయోగశాలలలో ఈ గౌరవం ప్రదానం చేయబడింది.
పర్యావరణ పరిరక్షణకు, పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థకు గర్వకారణమైన సందర్భం.
వృక్షజీవి డాక్టర్ మార్కండేయులు కు తెలంగాణ ఉన్నత న్యాయస్థాన గౌరవనీయ న్యాయమూర్తి జుకంటి అనిల్ కుమార్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మకమైన 'సిల్వన్ కంపానియన్'- 'అడవుల మిత్రుడు పురస్కారం ప్రదానం చేయబడింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మేధావులు, విశిష్ట వ్యక్తులు పాల్గొన్న ఈ సభలో ప్రసంగించిన డాక్టర్ మార్కండేయులు, ఆరోగ్యకరమైన దేశ నిర్మాణానికి, భావితరాలకు సుస్థిరమైన భవిష్యత్తును అందించడానికి పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకం,ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన వైఖరి ఎంతగానో అవసరమని ఉద్ఘాటించారు. ఈ గర్వకారణమైన సందర్భంలో, విశ్వగురు ప్రపంచ రికార్డుల సంస్థ నుంచి తాను అందుకున్న ఈ గౌరవాన్ని డాక్టర్ మార్కండేయులు వినయపూర్వకంగా పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ సభ్యులకు, అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం తాను సాగిస్తున్న స్ఫూర్తిదాయక ప్రయాణంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ అంకితం చేశారు.
ఆయన చేసిన ఈ అంకిత ప్రకటన ఆయన వినయాన్ని, సమిష్టి కృషిపై ఉన్న విశ్వాసాన్ని, ప్రకృతి మాత సేవ పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

**పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ సేవలను ప్రశంసించిన గౌరవనీయ న్యాయమూర్తి**

తెలంగాణ ఉన్నత న్యాయస్థాన గౌరవనీయ న్యాయమూర్తి జుకంటి అనిల్ కుమార్ పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ సాధించిన ప్రశంసనీయమైన విజయాలను




అభినందించారు. ముఖ్యంగా, కాలుష్యరహిత ప్రపంచ నిర్మాణం కోసం డాక్టర్ మార్కండేయులు చేస్తున్న అంకితభావంతో కూడిన కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన తన హృదయపూర్వక శుభాకాంక్షలను ఈ విధంగా తెలియజేశారు.

**"మానవసేవయే మాధవసేవ"**

మీ సంకల్పం అజేయం కావాలి. మీ కీర్తి నలుదిశలా వ్యాపించాలి. ఇటువంటి విజయాలు మరెన్నో మహోన్నత ఘనతలకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షిస్తున్నానుఅంతేకాకుండా, రాబోయే రోజుల్లో పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ లక్ష్యం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తన వంతు సహకారాన్ని, సాధ్యమైన ప్రతి విధంగా అందించడానికి సిద్ధంగా ఉన్నానని కూడా ఆయన తెలియజేశారు.

**ఒక వ్యక్తి సాధించిన గౌరవం మానవాళి మొత్తం పంచుకునే స్ఫూర్తి..**

డాక్టర్ మార్కండేయులు కు లభించిన ఈ గుర్తింపు కేవలం ఒక వ్యక్తి సాధించిన విజయమే కాదు. అడవులను రక్షించడానికి, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి, భూమాతను కాపాడడానికి నిరంతరం శ్రమిస్తున్న ప్రతి పర్యావరణ కార్యకర్త చేస్తున్న సమిష్టి కృషికి లభించిన గౌరవం ఒక వ్యక్తికి దక్కవచ్చు..

**కానీఆలక్ష్యం యావత్ మానవాళికి చెందినది.**

ప్రజల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడం, ప్రకృతి పరిరక్షణ పట్ల బాధ్యతను ప్రేరేపించడం, పచ్చదనంతో నిండిన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ప్రపంచం అనే సంకల్పాన్ని సాకారం చేయడం కోసం పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ తన కృషిని నిరంతరం కొనసాగిస్తోంది.

**పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ కేంద్ర కమిటీ సభ్యుల అభినందనలు**

ఈ కార్యక్రమంలో పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ కేంద్ర కమిటీ సభ్యులైన డాక్టర్ రామస్వామి, డాక్టర్ శాంతను ఏ. సుధర్శన్,డాక్టర్ నందిని నాయుడు, డాక్టర్: తదితరులు పాల్గొన్నారు. వృక్షజీవి డాక్టర్ మార్కండేయులు ఈ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం లభించిన సందర్భంగా వారు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న నిరంతర కృషిని, ప్రకృతి పట్ల ఆయనకున్న అంకితభావాన్ని కొనియాడారు.
ఈ పురస్కారం పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ కుటుంబ సభ్యులందరికీ ఎంతో గర్వకారణమైనదిప్రకృతిని కాపాడాలనే గొప్ప సంకల్పంతో ముందుకు సాగుతున్న ప్రతి ఒక్కరికీ ఇది మరింత స్ఫూర్తిని, ఉత్సాహాన్ని అందిస్తుంది.
ప్రకృతిని కాపాడుదాం.. పచ్చదనాన్ని పెంపొందిద్దాం.. కాలుష్యరహిత ప్రపంచాన్ని నిర్మిద్దాం.!
పర్యావరణ చైతన్య ప్రపంచీకరణ సంస్థ లక్ష్యం ఒక్కటే..ప్రకృతి పరిరక్షణ ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని, పచ్చని భూమిని, సుస్థిరమైన భవిష్యత్తును భావితరాలకు అందించడం.
ప్రకృతి పరిరక్షణ మన బాధ్యత.. పచ్చదనం మన సంపద భావితరాల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది.

# బిజెపి రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కేశిరెడ్డి పద్మారెడ్డి ఆధ్వర్యంలో

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం..




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు, ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ బీజేపీ మహిళా మోర్చా నిరసన రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం లోని కామినేని చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కేశి రెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ, మహిళల గౌరవం, విద్యార్థినుల భద్రత వంటి సున్నితమైన అంశాలపై రాజకీయ నాయకులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని అన్నారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు, చర్యలను బీజేపీ మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తుందని స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ మాటలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. లోక్‌సభ ఎంపీ అంగోమ్‌చా బిమోల్‌పై విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయాలని ఆమె డిమాండ్



చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత వ్యక్తిపై తగిన పార్టీ పరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన చర్యల్లో భాగంగా పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. అలాగే, ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించడం పై స్పందిస్తూ, ఓటరు జాబితాల ప్రక్షాళనలో పారదర్శకతకు, అర్హులైన ఓటర్ల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు బీజేపీ మద్దతు తెలుపుతోందని, ఓటరు జాబితాలను తప్పుల్లేకుండా రూపొందించే ప్రయత్నాలకు సహకరించాలని పేర్కొన్నారు. సీఈఓ జ్ఞానేశ్వర్ రాజీనామా అంశంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న డిమాండ్లను ఆమె వ్యతిరేకిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా రాజకీయ పార్టీలు వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల జాబితాల సవరణను రాజకీయ వివాదాలకు పరిమితం చేయకుండా, ప్రజాస్వామ్య ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీకి సూచించారు. ఈ కార్యక్రమంలోరంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీత రెడ్డి,మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సృజన,మాధవి మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కొందుర్గులో బీఆర్ఎస్ నాయకుల మీడియా సమావేశం..

## రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎండిపోతున్న పంటలు, విద్యుత్ కోతలు,ఎరువుల కొరత తదితర అంశాలపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.
సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని జి.ఎం.పటేల్ మినీ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం,వర్షాల కొరత,విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన ఉపశమన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తెలంగాణ నదీ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతున్నారని ఆరోపిస్తూ,రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.

**కెసిఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు**

షాద్‌నగర్ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమకారుల పట్ల,తెలంగాణ జాతిపితగా తాము భావించే కేసీఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని,మరోవైపు బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేసి,దుస్తులు విప్పించి జైలుకు పంపించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో పోలీసుల వ్యవహారశైలిపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పెరిగాయని, ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు.

**రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృశ్య,ఓటరు సభ్యత్వ నమోదు పై దృష్టి పెట్టండి.**

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలని,పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**ఎండిన పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందించాలి**

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల కొరత, విద్యుత్ కోతలు,ఎల్‌నినో ప్రభావం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం అమలుపైనా విమర్శలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను సందర్శించి, ఎండిపోయిన పంటలను పరిశీలించి,నష్ట వివరాలతో నివేదికలు రూపొందించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలుపరచడంలో విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అంజయ్య యాదవ్ విమర్శించారు.
ప్రభుత్వం మిగిలిన కాలంలోనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు.రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో కొందుర్గు సర్పంచ్ చౌడపురం



ప్రభాకర్,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నె కవిత నారాయణ యాదవ్,బీఆర్ఎస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,హఫీజ్,నటరాజన్,లక్ష్మణ్ నాయక్,మాజీ జడ్పీటీసీ బంగారు రాములు,మాజీ ఎంపీపీ తనయుడు పోతురాజు గోపాల్,సర్పంచులు మోహనచారి,సోని శేఖర్, నాయకులు కొండి యాదయ్య,వెంకటేష్,సత్య ప్రమోద్ పంతులు,దానగల్ల రాములు, ఆకుల మానయ్య, నర్సింలు, దర్గా రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. పలువురు సర్పంచులు,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు.

# దొరికిపోతాననే భయంతో చంపేశాడు

**బొల్లారంలో చిన్నారి హత్య కేసును ఛేదించిన పోలీసులు..**

**24 గంటల్లో నిందితుడి అరెస్టు.. రిమాండు**

**ఏడుస్తూ, చేతులతో కొడుతుండడంతో అతడు పాపను హత్య చేశాడు**

**వెల్లడించిన మల్కాజిగిరి సీపీ సుమతి**

**పనివాళ్ల వివరాలు పోలీసులతో ధ్రువీకరించుకోవాలని సూచన**




**హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, అక్టోబర్ 12:(ప్రజావినికిడి):**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐదేళ్ల చిన్నారి హత్య కేసు నిందితుణ్ని 24 గంటల్లో అరెస్టు చేసి కోర్టుల హాజరుపరిచామని మల్కాజిగిరీ సీపీ సుమతి తెలిపారు. హైదరాబాద్‌లోని బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో.. కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్న రిసెర్చ్ సైంటిస్ట్ మిల్టర్ ఫెర్నాండజ్ మోసెస్ (44) కుమార్తె ఆరెలియా (5) అలియాస్ మోనును నిందితుడు చీకటిగా ఉన్న సెల్లార్‌లోకి తీసుకెళ్లాడని, పాప భయంతో ఏడుస్తూ, చేతులతో నిందితుడి ముఖంపై కొట్టడం ప్రారంభించడంతో ఆమెను సముదాయించలేక, దొరికిపోతాననే భయంతో చంపేశాడని వివరించారు. సెల్లార్‌లో దొరికిన తాళ్లతో పాప కాళ్లు, చేతులు కట్టేసి, గొంతుకు ఉరిబిగించి హత్య చేశాడని.. తర్వాత అక్కడే పడి ఉన్న ఒక రాయిని పాప వీపునకు కట్టి పాడుబడ్డ నీళ్ల సంపులో పడేసి ఏమీ ఎరుగనట్లు వెళ్లిపోయాడని చెప్పారు.
పాప తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న అనంతరం.. ఎస్‌వోటీ, క్రైమ్స్, ఎస్‌బీ, టెక్నికల్, లా అండ్ ఆర్డర్ పోలీసులు కలిసి 10 బృందాలుగా ఏర్పడి సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారని సీపీ తెలిపారు. కిడ్నాపర్ ఫోన్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించి దర్యాప్తు వేగవంతం చేశామని తెలిపారు. వందలాది, సీసీ పుటేజీలు, పరిశీలించిన పోలీసులు బాలిక గేటెడ్ కమ్యూనిటీ నుంచి బయటకు రాలేదని గుర్తించామని.. వెంటనే గేటెడ్ కమ్యూనిటీలోని అణువణువు గాలించగా.. క్లబ్‌హౌస్ సెల్లార్‌లోని నీటిగుంతలో బాలిక మృతదేహం కనిపించిందని చెప్పారు. వెంటనే టెక్నికల్, ఫోరెన్సిక్ బృందాలు అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించాయని.. పోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని విషయాలు తెలుస్తాయని సీపీ తెలిపారు.

**రెండువారాలకే పనిమానేసి..**

బీహార్ నలంద జిల్లాకు చెందిన విక్రమ్ కుమార్ కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 6 వరకూ (రెండు వారాలపాటు) సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. ఆ గేటెడ్ కమ్యూనిటీలో చురుగ్గా తిరిగే చిన్నారి ఆరేలియాపై అతడి కన్ను పడింది. పాపను కిడ్నాప్ చేసి, వారి తల్లిదండ్రుల నుంచి డబ్బు వసూలు చేయాలని విక్రమ్ పథకం వేశాడు. పథకంలో భాగంగా ఈనెల 10న గేటెడ్ కమ్యూనిటీలో దసరా సందర్భంగా జరుగుతున్న పనులు చేసేందుకు వచ్చానంటూ గేటు వద్ద సెక్యూరిటీకి చెప్పి సాయంత్రం 6.40 గంటల ప్రాంతంలో లోపలికి వచ్చాడు. అక్కడ అతడికి ఆరేలియా కనిపించింది. ఆమెను మాటలతో మభ్యపెట్టి సెల్లార్‌లోకి తీసుకెళ్లాడు. ఆమెతో మంచిగా మాట్లాడి ఆమె తండ్రి, తాత ఫోన్ నంబర్ తెలుసుకున్నాడు. గతంలో అతడు సెక్యూరిటీ గార్డుగా పనిచేసి ఉండడంతో పాప అతణ్ని నమ్మి, అమాయకంగా వారి నంబర్లు ఇచ్చింది. అయితే, సెల్లార్‌లో చీకటిగా ఉండటం, అక్కడ ఇంకెవరూ లేకపోవడంతో భయపడి ఏడవడం మొదలుపెట్టింది.
అడ్డుకున్న విక్రమ్ ముఖంపై కొడుతూ ఏడుస్తుండడంతో అతడు ఆమెను నిర్దాక్షిణ్యంగా చంపేశాడు. తర్వాత, ఏమీ తెలియనట్లు అక్కణ్నుంచీ బయటకెళ్లిపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత.. పాప తాతకు ఫోన్ చేసి, ఆమెను కిడ్నాప్ చేశానని, రూ.20లక్షలు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించాడు. డబ్బులు ఇస్తామని, పాపను చూపించాలని కోరినా చూపించలేదు.



అప్పటికే రంగంలోకి దిగిన పోలీసుల తెల్లవారుజామున 4 గంటలకు సంపులో పాప మృతదేహాన్ని గుర్తించారు. అందరూ గుండెలుపగిలేలా రోదిస్తున్న సమయంలో విక్రమ్ మరోసారి ఫోన్‌చేసి.. “డబ్బులు ఇస్తారా? పాపను చంపేయాలా?” అంటూ బ్లాక్‌మెయిల్ చేశాడు. పోలీసులు ఆ ఫోన్‌కాల్ ఆధారంగా సాంకేతికతను వాడి నిందితుడు యూసఫగూడలో ఉన్నట్టు గుర్తించి ఆదివారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**పనివారితో భద్రం: సీపీ సుమతి**

గేటెడ్ కమ్యూనిటీల్లో నివసించేవారు తమ వద్ద పనిచేస్తున్న సిబ్బంది, సెక్యూరిటీ, వాచ్‌మెన్‌లు, ఇంటి పనివారి వివరాలు తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని మల్కాజిగిరి సీపీ సుమతి సూచించారు. దీని కోసం పోలీసులు అందించే “మీ సురక్ష- డొమెస్టిక్ హెల్పర్స్ వెరిఫికేషన్” సేవను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీ పూర్తిగా కవర్ అయ్యేలా అత్యాధునిక సీసీ కెమెరాలు అమర్చుకోవాలని, పోలీసులతో అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, నివాసితులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# నిరుద్యోగ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ



**చిక్కడపల్లి, (ప్రజావినికిడి):** చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో తెలంగాణ సంపూర్ణ చరిత్ర పుస్తక రచయిత హెచ్‌ఎం టీవీ స్టాఫ్ రిపోర్టర్ దేవాపూజా శ్రీకాంత్ స్వయంగా రాసిన తెలంగాణ సంపూర్ణ చరిత్ర పుస్తకాలు నిరుద్యోగ విద్యార్థులకు ఉచితంగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్, నల్గొండ,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పరికిరాల నరేష్, నిరుద్యోగ జేఏసీ నాయకుడు శంకర్ నాయక్ ముఖ్య అతిధులు గా హాజరు అయి లైబ్రరీలో ఉండే నిరుద్యోగులకు ఉచితంగా పుస్తకాలు ఇచ్చినందుకు దేవాపూజా శ్రీకాంత్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాంత్ మాట్లాడుతూ, విద్య గొప్పతనాన్ని నిరుద్యోగ మిత్రులకు తెలియజేస్తూ కాలం చాలా విలువ అయినదని అందరు సమయాన్ని మంచిగా ఉపోయోగించుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానాలో ఉండాలని నిరుద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు వేణు,ప్రశాంత్, బాలు,శ్రీను, ఉపేందర్,అనిల్, స్వప్న,మమత, మాధురి తదితరులు పాల్గొన్నారు.

# కేశంపేట మండలం నిడదవెల్లికి చెందిన వ్యక్తి ఆత్మహత్య.





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం నిడదవెల్లి గ్రామానికి చెందిన కమ్మరి పాండ్యయ్య (59) మృతి విషాదాన్ని నింపింది. గత 25 ఏళ్లుగా రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన సోమవారం తెల్లవారు జామున రైలు పట్టాలపై మృతిచెందారు. ఈ ఘటనతో ఆయన కుటుంబ సభ్యులు, పరిచయస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారుపాండ్యయ్య రెండేళ్ల క్రితం భార్యను కోల్పోయారు.
అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్న ఆయన కొంతకాలంగా తీవ్రమైన కాళ్ల నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. అనారోగ్య సమస్యల కారణంగా రోజువారీ పనులు చేసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యులకు భారం కాకూడదనే ఆలోచనతోనే ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అయితే ఆయన మరణానికి దారితీసిన పూర్తి కారణాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఎంతోకాలంగా నందిగామలో వృత్తి పని చేసుకుంటూ అందరితో కలివిడిగా ఉండే పాండ్యయ్య మృతితో స్థానికంగా విషాదఛాయలుఅలుముకున్నాయి. వృద్ధాప్యంలో ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి కుటుంబ సభ్యులు,బంధువులు,సమాజం అండగా నిలవాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తుచేస్తోంది. కష్టకాలంలో ఉన్నవారికి ఆత్మీయత, మానసిక ధైర్యం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

# గాజులరామారంలో అక్రమ నిర్మాణాలపై పలు అనుమానాలు..

**అధికారుల పర్యవేక్షణ ఏది.? నిర్మాణ అనుమతులపై విచారణ చేపట్టాలి..**

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** కుత్బుల్లాపూర్ పరిధిలోని గాజులరామారం, ఓక్షిత్ ఎంక్లేవ్ రోడ్ నంబర్-4, స్వస్తిక్ ఫ్రైడ్ ఎదురుగా బాలాజీ లేఔట్ సమీపంలో జరుగుతున్న భవన నిర్మాణం చర్చనీయాంశంగా మారింది. భారీ భవనాన్ని ఆకుపచ్చ నెట్‌తో కప్పి నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో, భవనానికి అనుమతులు ఉన్నాయా.? ఆమోదిత ప్లాన్ ప్రకారమే నిర్మాణం జరుగుతోందా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిర్మాణ అనుమతులు, నిబంధనల అమలుపై విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమమైతే చర్యలు తీసుకోవాలి..



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

**ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు**

**5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు**

**విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటన**

**మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు**

**అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు**

**రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ**




**అక్టోబర్ 12(ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది.ప్రకటించిన జాబితా ప్రకారం, 106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు.అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

**కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా**

ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3
ఎస్టీ – మహిళ: గూడూరు
ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు
ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14
ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.
ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.

**బీసీ (వెనుకబడిన తరగతులు) - 35**

బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.

**బీసీ - జనరల్:** కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

**జనరల్ కేటగిరీ (మహిళ)**

ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.
కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస–కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

అన్‌రిజర్వ్ (జనరల్)
కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్‌గా ఉన్నాయి.
పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల.

ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

**కార్పొరేషన్లు రిజర్వేషన్ల కేటాయింపు ఇలా :**

ఎస్టీ (ఒకటి): మంగళగిరి–తాడేపల్లి
ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు
బీసీ – మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ
బీసీ – జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు
జనరల్ – మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం
అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# భారత్‌లో నేపాల్, బంగ్లాదేశ్ తరహా అస్థిరతకు కుట్ర

**: హరీశ్ సాల్వే సంచలన ఆరోపణలు**



**అక్టోబర్ 12:(ప్రజావినికిడి):**
భారతదేశంలో నిరసనల పేరుతో నేపాల్, బంగ్లాదేశ్‌లో మాదిరిగా అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీనియర్ అడ్వకేట్, భారత మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో అశాంతిని రెచ్చగొట్టడంలో విదేశీ శక్తుల పాత్ర ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. 'ఐఏఎన్ఎస్' వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.
కొన్ని నిరసన కార్యక్రమాలకు విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని తాను విశ్వసిస్తున్నట్లు సాల్వే తెలిపారు. ప్రభుత్వ పురోగతిని అడ్డుకోవడానికి కొన్ని గ్రూపులు ప్రయత్నిస్తున్నాయని, ప్రదర్శనల కోసం ఇంత డబ్బు ఎక్కడి నుంచి వస్తోందని ఆయన ప్రశ్నించారు.
పొరుగు దేశాల్లో రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. "నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లో జరిగిన గందరగోళం వెనుక ఎవరున్నారనే దానిపై సందేహం ఉందా? నా అభిప్రాయం ప్రకారం, ఈ సంఘటనల వెనుక విదేశీ శక్తులు ఉన్నాయి" అని అన్నారు.భారత్‌లోనూ అలాంటి ధోరణే కనిపిస్తోందని, దీప్కే, సౌరవ్ దాస్ వంటి కొందరు ఆకస్మికంగా నిరసనలకు నాయకులుగా ముందుకొస్తున్నారని సాల్వే ఆరోపించారు. జర్మనీ వంటి దేశాల్లో నివసించే కొందరు ఇక్కడ ఎలా నాయకులుగా చలామణి అవుతున్నారని, ఈ కార్యకలాపాలకు వారికి నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించారు.గత ఆరు నుంచి ఎనిమిది నెలలుగా జరుగుతున్న పరిణామాలు ఒక పద్ధతి ప్రకారం ప్రభుత్వ పనులను అడ్డుకోవడానికేనని స్పష్టమవుతోందని సాల్వే అన్నారు. "మోదీ ప్రభుత్వం హర్మూజ్ జలసంధి సంక్షోభం, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక పురోగతి వంటి అంశాలపై దృష్టి సారిస్తుంటే, ఈ గ్రూపులు ప్రభుత్వాన్ని ముందుకు వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నాయి" అని ఆయన వివరించారు. విదేశీ నిధుల ఆరోపణలపై ప్రభుత్వం దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
అయితే, జరుగుతున్న నిరసనలను తాను ప్రజా ఉద్యమంగా భావించడం లేదని సాల్వే స్పష్టం చేశారు. యూట్యూబ్ వీడియోలు, రీల్స్ ద్వారా తప్పుడు ప్రచారాలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ఇది నిజమైన ప్రజా ఉద్యమం కానందున ఎక్కువ కాలం నిలవదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వ్యవస్థను అస్థిరపరిచే ఇలాంటి ఉద్యమాలతో వ్యవహరించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..

## స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్

**ఢిల్లీలో నిరసనల కోసం రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు**



**అక్టోబర్ 12: (ప్రజావినికిడి):**
దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.
సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు.మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడిందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ–నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

# ప్రతి నియోజకవర్గంలో ఒక శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది: మంత్రి ఆనం



**అక్టోబర్ 12(ప్రజావినికిడి):**
రాష్ట్రవ్యాప్తంగా శ్రీవాణి ట్రస్టు ద్వారా 5,000 ఆలయాలను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ఆయన భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఆలయానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 6,700 ఆలయాల్లో దూప, దీప, నైవేద్యాల కోసం అర్చకుల ఖాతాల్లో ప్రతినెలా రూ.10,000 జమ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.అనంతరం ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. సోమశిల జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా ఆత్మకూరుకు తాగునీరు సరఫరా చేస్తున్నామని, పట్టణంలో అంబేద్కర్, షాదీ మంజిల్ భవనాలకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందని ఆయన అన్నారు.

# వివేకా హత్య కేసు: ఈడీ విచారణకు హాజరైన శివశంకర్ రెడ్డి




**అక్టోబర్ 12(ప్రజావినికిడి):**
మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో 5వ నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి ఈరోజు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. హత్య కేసుతో సంబంధం ఉన్న ఆర్థిక లావాదేవీల గురించి అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు.వివేకా హత్య కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, చార్జ్‌షీట్ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం ) కింద కేసు నమోదు చేసింది. ఈ హత్య వెనుక రూ.40 కోట్ల సుపారీ లావాదేవీ జరిగిందని సీబీఐ తన చార్జ్‌షీట్‌లో ఆరోపించింది. ఈ నేపథ్యంలో హత్యకు సంబంధించిన ఆర్థిక మూలాలపై ఈడీ దృష్టి సారించింది. శివశంకర్ రెడ్డి ఈ కుట్రలో కీలకపాత్ర పోషించారని, నిధులను సమకూర్చుతానని హామీ ఇచ్చారని సీబీఐ ఆరోపణలు చేసింది.ఈ ఆరోపణల నేపథ్యంలోనే శివశంకర్ రెడ్డిని ఈడీ అధికారులు విచారిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి గత ఆగస్టులో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డితో పాటు శివశంకర్ రెడ్డి ఇళ్లలోనూ ఈడీ సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.కాగా, ఇదే కేసులో విచారణకు హాజరుకావాలని కడప వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డికి ఈడీ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. అక్టోబర్ 14న ఆయన విచారణకు రానున్నారు.

# పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

**కాకినాడ సీఐఐ ప్రాంతీయ సదస్సుకు**

**ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించిన పవన్ కళ్యాణ్**






**కాకినాడ, అక్టోబర్ 12: (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పారిశ్రామికవేత్తలు లాభాలకే పరిమితం కాకుండా దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి కల్పనపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.
కాకినాడలోని జేఎన్టీయూలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కాకినాడ ప్రాంతంలో రూ.6,347 కోట్ల పెట్టుబడులతో చేపట్టనున్న ప్రాజెక్టుల ద్వారా సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.సింగపూర్ తరహాలో సమష్టి కృషితో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని పరిరక్షిస్తూనే పర్యావరణహిత పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలను కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు, సీఐఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేధ, జై జాస్తి జంటగా

## మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం






టాలీవుడ్‌లో సీనియర్ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ మేకా హీరోయిన్‌గా అరంగేట్రం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి నెలకొంది. జై జాస్తి హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'మైత్రీ ఇన్ లవ్' అనే వర్కింగ్ టైటిల్‌ను పరిశీలిస్తున్నారు.

సోమవారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది" అనే వ్యాఖ్యతో ఈ పోస్టర్‌ను పంచుకుంది. ఇది ఒక అందమైన ప్రేమకథగా రూపుదిద్దుకోనుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తుండగా, మహేశ్ బాబు. పి క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఈ కొత్త సినిమా టైటిల్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. కాగా, నేటి ముహూర్తం ఈవెంట్ కు టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నటుడు శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. దర్శకురాలు నందినిరెడ్డి ముహూర్తం షాట్ కు క్లాప్ కొట్టారు.

# అల్లు అర్జున్ తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్న లోకేశ్

### "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే.." అంటూ క్యాప్షన్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా 'ఏఏ23'పై ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ ప్రాజెక్టు ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం జరగ్గా.. దర్శకుడు లోకేశ్ తాజా పోస్టుతో ఆ ఊహాగానాలకు తెరదించారు. త్వరలోనే ఆసక్తికరమైన వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.లోకేశ్ కనగరాజ్ సోమవారం తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో అల్లు అర్జున్‌తో మాట్లాడుతున్న ఫొటోను పంచుకున్నారు. "ఆసక్తికరమైన అప్‌డేట్స్ త్వరలోనే వస్తున్నాయి" అంటూ క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ సినిమాపై అభిమానుల్లో మళ్లీ అంచనాలు పెరిగాయి.అల్లు అర్జున్, లోకేశ్ కనగరాజ్ తొలిసారి కలిసి పనిచేయనున్నట్లు ఈ ఏడాది జనవరిలో అధికారికంగా ప్రకటించారు. ఆ సందర్భంగా విడుదల చేసిన వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. అందులో ఓ సింహం స్థిరంగా నిలబడగా.. దాని చుట్టూ కొన్ని నక్కలు తిరుగుతూ ఆధిపత్యం చెలాయించేందుకు ప్రయత్నిస్తాయి. ఈ వీడియో సినిమా కథ గురించి పెద్దగా వివరాలు వెల్లడించకపోయినా.. ప్రాజెక్టుపై భారీ అంచనాలు పెంచింది.'ఏఏ23'ను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. గతంలో అల్లు అర్జున్ నటించిన బ్లాక్‌బస్టర్ 'పుష్ప'ను కూడా ఈ నిర్మాణ సంస్థే తెరకెక్కించింది. అయితే 'ఏఏ23' కథ, ఇతర నటీనటులు, చిత్రీకరణ వివరాలపై అధికారికంగా మరింత సమాచారం రావాల్సి ఉంది.మరోవైపు అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న 'రాకా' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఇందులో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నారు. అల్లు అర్జున్, దీపికా తొలిసారి జంటగా కనిపించనున్న ఈ సినిమాపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఏప్రిల్ 8న అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా 'రాకా'ను అధికారికంగా ప్రకటించడంతో పాటు ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు.ఇప్పుడు 'ఏఏ23'పై లోకేశ్ చేసిన తాజా ప్రకటనతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందా? ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్న ఉత్కంఠ మొదలైంది.

# నా జీవితంలో చేసిన అతిపెద్ద ప్రయోగం అదే..

### ఆసక్తికర విషయాలు చెప్పిన రాజమౌళి





దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కెరీర్‌లో 'బాహుబలి'కి ప్రత్యేక స్థానం ఉంది. ఈ సినిమాతో ఆయన పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించగా, 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. అయితే తనకు అత్యంత సంతృప్తినిచ్చిన సినిమా మాత్రం 'బాహుబలి' కాదని రాజమౌళి వెల్లడించారు. తనలో నిజమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిన చిత్రం 'ఈగ' అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సూపర్‌స్టార్ మహేశ్ బాబుతో కలిసి రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌తో మాట్లాడిన ఆయన తన సినీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. ప్రేక్షకులు తన కెరీర్‌ను 'బాహుబలి'కి ముందు, తర్వాత అని విభజించి చూస్తారని, కానీ తన దృష్టిలో మాత్రం 'ఈగ'కు ముందు, తర్వాత అనే విభజన ఉంటుందని తెలిపారు.'ఈగ' తన కెరీర్‌లో చేసిన అతిపెద్ద ప్రయోగమని రాజమౌళి చెప్పారు. ఒక ఈగను ప్రధాన పాత్రగా తీసుకుని, దాని చుట్టూ భావోద్వేగాలతో కూడిన కథను నడిపించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభవమని వివరించారు. ఆ సినిమా తనకు అందించిన సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎన్ని సినిమాలు తీసినా 'ఈగ' తనకు ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుందని స్పష్టం చేశారు.రాజమౌళి వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. భారీ స్థాయి చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు, తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిన సినిమాగా 'ఈగ'ను పేర్కొనడం విశేషం. మరోవైపు మహేశ్ బాబుతో రూపొందిస్తున్న 'వారణాసి'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.



# అసలు ఊహించలేదు..

## జడ్జిగా అవకాశం రావడంపై అనుపమ కామెంట్స్!

టాలీవుడ్ టాలెంటెడ్ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ నటిస్తూ అదరగొడుతున్న ఆమె, త్వరలోనే 'క్రేజీ కల్యాణం' సినిమాతో అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న అనుపమ, ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన కెరీర్‌కు సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా రియాలిటీ షోకి జడ్జిగా మారడంపై ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. షాకింగ్‌గా అనిపించింది: ఇంటర్వ్యూలో భాగంగా "అది కొత్త ఏమీ కాదు.. జడ్జి అవ్వడం, డాన్స్ షో చేయడం మీకు ఎలా అనిపించింది?" అని ప్రశ్నించగా, అనుపమ చాలా సరదాగా స్పందించారు. "నాకు కూడా ఇదొక పెద్ద షాకే. నేను అసలు ఊహించలేదు. సడన్‌గా అలాంటి ఒక అవకాశం వచ్చింది. కొత్త విషయాలను ప్రయోగాత్మకంగా చేయడం నాకు ఇష్టం కాబట్టి వెంటనే ఓకే చెప్పాను. ఇక ఇప్పటికే సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, మ్యూజిక్ వీడియోలు చేశాను" అంటూ తన ఆశ్చర్యంతో పాటు ఎగ్జైట్‌మెంట్‌ను పంచుకున్నారు. 'ఢీ' షోలో జడ్జిగా ఎంట్రీ: తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న 'ఢీ' డ్యాన్స్ షోకు అనుపమ పరమేశ్వరన్, జానీ మాస్టర్ జడ్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. సినిమాల్లో గ్లామర్, యాక్టింగ్‌తో అలరించే అనుపమ, తొలిసారి ఒక డ్యాన్స్ రియాలిటీ షోకి జడ్జిగా ఎంట్రీ ఇవ్వడం ఆమె కెరీర్‌లో మరో విశేషంగా నిలిచింది. పల్లెటూరి నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం': ఇదిలా ఉంటే, అక్టోబర్ 16న విడుదల కానున్న 'క్రేజీ కల్యాణం' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్, అనుపమ పరమేశ్వరన్, అఖిల్ రాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఇక తెలంగాణ గ్రామీణ నేపథ్యం, బంధువుల గొడవలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సాగే ఈ సినిమా ట్రైలర్ ఇటీవల విడుదలై యూట్యూబ్‌లో దూసుకుపోతోంది.

# పవన్ కల్యాణ్ తొలి సినిమాకు 30 ఏళ్లు..

## అల్లు అరవింద్ స్పెషల్ నోట్

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమలో 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రత్యేక లేఖను విడుదల చేశారు. పవన్ కల్యాణ్ సినీ ప్రస్థానం, ఆయన సామాజిక దృక్పథాన్ని ప్రశంసిస్తూ రాసిన ఈ లేఖ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

"ప్రియమైన శ్రీ పవన్ కల్యాణ్ గారికి, మన ఇద్దరి కలయికలో వచ్చిన మొదటి సినిమా విడుదలై 30 సంవత్సరాలు పూర్తయిందని తెలిసి ఆశ్చర్యానికి, దాదాపు షాక్‌కు గురయ్యాను. ఈ పరిశ్రమలో మీరు అద్భుతమైన ప్రయాణాన్ని సాగించారు. 30 ఏళ్లు పూర్తి చేసుకున్న మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని అల్లు అరవింద్ తన లేఖలో పేర్కొన్నారు.

పవన్ కల్యాణ్ భవిష్యత్తును ఉద్దేశిస్తూ, "మీరు ఎంచుకున్న మార్గంలో మరిన్ని సంవత్సరాలు విజయం సాధించి, సంతృప్తికరమైన జీవితం గడపాలని నేను ఆకాంక్షిస్తున్నాను. అన్నింటికంటే ముఖ్యంగా, సినిమాలకు అతీతంగా సమాజం పట్ల మీకున్న విస్తృత దృష్టిని, మీరు చేస్తున్న సేవను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను" అని కొనియాడారు. చివరగా, "డియర్ కల్యాణ్, మరోసారి అభినందనలు. నా శుభాకాంక్షలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని అల్లు అరవింద్ తన లేఖను ముగించారు.

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" చిత్రానికి అల్లు అరవింద్ నిర్మాతగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వారి ప్రొఫెషనల్ బంధాన్ని గుర్తుచేసుకుంటూ, నేడు పవన్ కల్యాణ్ ఒక నటుడిగానే కాకుండా ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవలో ఉన్న తరుణంలో అల్లు అరవింద్ ఈ లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది.పవన్ కల్యాణ్, సుప్రియ యార్లగడ్డ జంటగా ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' చిత్రం 1996 అక్టోబరు 11న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ తొలి చిత్రంలో పవన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి.







# 'కాస్ట్' టీజర్ విడుదల

వరుణ్ సందేశ్, గగన్ బాబు , సత్యం రాజేశ్, రవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషల్ డ్రామా 'కాస్ట్'. ఏకే జంపన్న రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్నారు. కశిక కపూర్, దివి వద్యా కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్‌ను లాంచ్ చేశారు టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ ఈ సినిమాతో జంపన్నకు చాలా మంచి పేరు రావాలని, మరిన్ని సక్సెస్‌ఫుల్ సినిమాలు చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు.ప్రొడ్యూసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ 'మా హీరోలు వరుణ్ సందేశ్, గగన్, రవితో పాటు మా టెక్నీషియన్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. అనూప్ రూబెన్స్ అద్భుతమైన మ్యూజిక్ చేశారు. త్వరలోనే పాటలు విడుదలవుతాయి. డైరెక్టర్ ఈ సినిమాను బ్రహ్మాండంగా తీశారు' అని అన్నారు. డైరెక్టర్ ఏకే జంపన్న మాట్లాడుతూ ఈ సినిమాలో వరుణ్ సందేశ్, రాజేశ్, రవి, గగన్ అద్భుతంగా నటించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ రావు, నవీన్ ఎర్నేని, గగన్ బాబు, అనూప్ రూబెన్స్, రవి, సత్యం రాజేశ్, దివి వద్యా పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613